అమృత్ కిరణ్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# పండుటాకులు

-చెరుకూరి వెంకట్రావు

"మీ... నగుమోము... నా కనులారా... కడదాకా... కననీండూ..."

రామయ్యపంతులు గారింట్లో తరచూ వాళ్ళ టేప్ రికార్డర్‌లో వినిపించే పాటిది.

రామయ్య పంతులుగారి భార్య సీతమ్మగార్కి ఈ పాటంటే చాలా ఇష్టం. ఈ వృద్ధాప్యంలో తన భార్యమాట తీసెయ్యలేకనో, లేక ఆమె పోరుపడలేకనో, రోజూ అదేపాట కనీసం రెండు, మూడు సార్లైనా టేప్‌రికార్డర్‌లో వేస్తారు.



సీతమ్మగారు టేపురికార్డరు దగ్గరకు వెళ్ళి తీరిగ్గా కూర్చొని ఎంతో శ్రద్ధగా వింటారు. రామయ్యగారు సీతమ్మగారి అమాయకత్వానికి జాలిపడేవారు.

అసలే 'బడి పంతులు' సినిమాకైతే సీతమ్మగారు. ఆ పక్క అమ్మలక్కలతో నైతేనేమి. తను ఒక్కర్తే నైతేనేమి. మొగుడు రామయ్యగారితోనైతేనేమి మొత్తానికి ఓ అరడజను మార్లైనా చూసి ఉంటారు సీతమ్మగారు.

రామయ్య పంతులుగారు రైల్వేలో గుమాస్తాగా చేరి హెడ్‌గుమాస్తాగా రిటైరై వాళ్ళ పల్లెటూళ్ళో వాళ్ళనాన్నగారెప్పుడో కొన్న ఓ చిన్న రెండుగదుల పెంకుటింట్లో సెటిలయ్యారు.

ఇంట్లో వాళ్ళిద్దరికీ కాలక్షేపానికి ఓ రేడియో, ఓ టేపురికార్డరు ఉన్నాయి! మగ సంతానం లేదు. ఉన్న ఇద్దరాడపిల్లలనీ చదివించి గ్రాడ్యుయేట్లు చేయించి తన తాహతుకు తగ్గ సంబంధాలు చూసి పెళ్ళిళ్ళు చేశారు.

పిల్లలిద్దరూ వాళ్ళ వాళ్ళ సంసారాలు చేసుకుంటున్నారు. తరచూ పిల్లలనూ, అల్లుళ్ళనూ పండుగలకు పిలిపించుకొని, ఓ నాల్గురోజులు ఉంచుకొని తన తాహతునిబట్టి వాళ్ళని సంతోషపెట్టి పంపించేస్తూ ఉండేవారు.

పిల్లలూ, అల్లుళ్ళిద్దరూ కూడా పరిస్థితులు అర్థం చేసుకొని, ఆ ఉన్న నాల్గురోజులూ అందరూ సరదాగా కాలక్షేపం చేసి, ఎక్కడివాళ్ళక్కడికి వెళ్ళేవాళ్ళు.

ఇలా రామయ్య, సీతమ్మగార్ల సంసారం సాగి

పోతోంది. కానీ రామయ్యగారి బాధల్లా భార్య సీతమ్మ గారి ఆరోగ్యం గురించే. ఆమెకు అయాసం. పదేళ్ళబట్టి అనారోగ్యంతో బాధపడుతోంది.

ఎవరేం చెపితే అది చేసేవారు. తిరుపతి వెంకటేశ్వర స్వామి వార్కి ముడుపు కూడా కట్టుకున్నారు. లాభంలేక పోతోంది ఏదీను. వర్షాకాలం, శీతాకాలాల్లో సీతమ్మగారికి అయాసం ఎక్కువగా ఉండేది.

అప్పుడప్పుడూ రామయ్య పంతులుగారు ఒక్కరే ఒంటరిగా కూర్చొని కళ్ళెమ్మట నీళ్ళు పెట్టుకునేవారు.

'అయ్యా... రామయ్యగారూ... ఈ ఆయాసంకి ఏదో మనశ్శాంతికి మందులు వాడటమే తప్ప, పూర్తిగా నయం కావడం కష్టం' అంటారు ఏ డాక్టరు దగ్గరికి వెళ్ళినా. రామయ్యగారు చాలా డబ్బు ఖర్చుచేశారు, చేస్తున్నారు. ఈ పదేళ్ళ నుంచీ, అంటున్నారందరు" అనేవాళ్ళు చాలామంది.

"రిటైరై ఇద్దరూ సుఖంగా ఉండవలసిన రోజుల్లో, ఇదో బాధనాకు." అని బాధపడ్తూ ఉండేవారు రామయ్య పంతులుగారు.

ఇలా ఉండుండీ ఓ రోజు రాత్రి విపరీతమైన అయాసం వచ్చి, మాటల్లేక కళ్ళు తేలేస్తే, ఆ ఊళ్ళోనే ఉన్న డాక్టరుగార్ని పిలిచారు.

"అమ్మగార్కి అర్జంటుగా ఆక్సిజన్ ఎక్కించాలి. నా క్లినిక్‌లో ఆ సౌకర్యం లేదు... పంతులుగారూ. మీరు త్వరగా హైదరాబాదుకు తీసుకొని వెళ్ళాలి." అంటూ డాక్టరుగారు పరీక్ష చేసి చెప్పారు.

"ఇప్పుడే నా కారునీ, డ్రైవరునీ పంపిస్తాను. ఓ రెండు గంటల్లో చేరిపోతారు హైదరాబాదు. ఉస్మానియా హాస్పిటల్లో నాకు తెలిసిన డాక్టర్లున్నారు." అంటూ ఉస్మానియాలో ఎమర్జెన్సీ వార్డులో ఉన్న డా॥ రెడ్డిగార్కి పర్సనల్ లెటరుకూడా రాసి ఇచ్చారు డాక్టరుగారు. అందాకా ఓ ఇంజక్షనూ, రెండు మాత్రలు తనే స్వయంగా ఇచ్చారు సీతమ్మగార్కి.

రామయ్యగారు తనబట్టలూ సీతమ్మగారి బట్టలూ వగైరా ఓ సంచిలో సర్దుకొని కారు గురించి చూస్తూంటే సీతమ్మగారు...

"ఏమండీ మన టేపురికార్డరూ... ఆ నా పాట కేసెట్టు కూడా తీసుకురండీ..." అనడం విని రామయ్యగారు ఏదో జ్ఞాపకం వచ్చిన వారిలా...

"ఆ... అవునుకదూ... మర్చిపోయా"నంటూ టేపురికార్డరూ, బడి పంతులు కేసెట్‌నీ తన సంచిలో పెట్టుకున్నారు.

ఇంతలో డాక్టరుగారి కారు రాగానే సీతమ్మగార్ని ఎక్కించిన తర్వాత, తను ఇంటికి తాళం వేసి, పక్క వాళ్ళతో చెప్పి మరీ కారెక్కాడు.


## పరిచయం

పేరు : చెరుకూరి వెంకట్రావు

వయస్సు : 69 సం॥లు

వృత్తి : రైల్వేలో మెకానికల్ ఇన్స్‌పెక్టర్ (రిటైర్డ్)

అభిరుచులు : మంచి రచనలు చేయటం, నలుగురికి ఉపయోగపడే పనులు చేయటం.



అడ్రస్
చెరుకూరి వెంకట్రావు
డి1-64, హుడాకాలనీ,
చందానగర్, గంగారం,
హైదరాబాద్-500 138.

ఆడపిల్లలిద్దరికీ వేరు వేరుగా టెలిగ్రాంలు వెళ్ళాయి. పిల్లలిద్దరూ అల్లుళ్ళతో సహా హాస్పిటల్‌కే డైరెక్టుగా ఎమర్జెన్సీ వార్డుకే వచ్చేశారు.

సీతమ్మగార్కి ఎమర్జెన్సీగా చేయవలసినదంతా చేస్తున్నారు సిస్టర్లు, ఆ వార్డు డాక్టరు సలహాతో. ఆక్సిజన్ పెట్టారు. రెండు ఇంజక్షన్లూ, రెండు టాబ్లెట్లూ ఇచ్చారు.

రామయ్య పంతులుగారు సీతమ్మగారి బెడ్ పక్కనే అచేతనంగా, దిగాలుగా అంతా చూస్తూ కూర్చున్నారు అప్పుడప్పుడూ తన పై పంచెతో కళ్ళు తుడుచుకుంటూ. ఆడపిల్లలిద్దరూ తండ్రి దగ్గరకొచ్చి కౌగిలించుకొని బావురుమన్నారు.

నర్సులు కొంత విసుక్కోవడంతో కొంత శాంతించారు. పిల్లలొచ్చిన చాలా సేపటికిగాని సీతమ్మగార్కి తెలివి రాలేదు. ఆయాసం కొంత తగ్గినట్లుంది. కళ్ళు తెరచి అందరినీ ఒక్కమారు చూశారు.

"మీ... నాన్నగారేరీ..." అనగలిగేరు కొంత కష్టం మీద. తన తల దగ్గరున్నారేమో రామయ్యగారు కనిపించ లేదు ఎదురుగా సీతమ్మగార్కి.

"ఇదిగో... నీ తల దగ్గరే ఉన్నా..." అంటూ ఆమె ముందుకి వచ్చారు కళ్ళు తుడుచుకుంటూ రామయ్య గారు.

"ఎలావుంది.... సీతా...? ఆయాసం కొంచెం తగ్గినట్లుంది!" పాపం అడగలేకపోతున్నారు.

"ఏమండీ... ఆపాట... నాపాట... ఓమారు వినాలనుందండీ..." ఆయాసంతో సీతమ్మగారు చెప్పలేక పోతున్నారు.

సీతమ్మగారు చెప్పేదేమిటో ఒక్క రామయ్యగారికే అర్థమైంది. కూతుళ్ళకీ, అల్లుళ్ళకీ ఏం అర్థంకాక రామయ్య గారికేసి చూస్తున్నారు అంతా.

"నాయనా రవీ..." అంటూ రామయ్యగారు పిల్చారు పెద్దల్లుణ్ణి.

"నా సంచీలో టేపరికార్డరూ, ఓ కేసెట్టు ఉంది తీసి కాసెట్టుపెట్టు బాబూ..."

"మీ నగుమోమూ... నా కనులారా... కడదాకా... కన నిండూ.................. పండుటాకులము మిగిలితిమీ. పాటయిపోయింది. టేపు రికార్డరు' ఆగిపోయింది ఒక్కమారు.

పిచ్చిగా నవ్వారు సీతమ్మగారు. ఆ నవ్వులో జీవంలేదు. తన భర్త, ఇద్దరు కూతుళ్ళూ, అల్లుళ్ళూ తన మంచం చుట్టూ ఉన్నారు. ఒక్కమారు అందరినీ చూసుకున్నారు.

తన భర్త రామయ్య పంతులుగార్ని మళ్ళీ ఓమారు చూసుకున్నారు. ఆమె కళ్ళు చెమ్మగిల్లి కన్నీళ్ళు కారుతున్నాయి... రామయ్యగారు తన పైపంచెతో ఆమె కళ్ళు తుడుస్తున్నారు.

అంతే... అంతా అయిపోయింది. సీతమ్మగారు శాశ్వతంగా కళ్ళు మూశారు. ఆయాసం ఒక్కమారు ఎక్కువగా రావడంతో సిస్టర్లు వచ్చి ఆక్సిజన్ కనెక్షన్ తీసేశారు.

అంతా బావురుమన్నారు ఒక్కమారు.

కొన్ని రోజులయాక ఇద్దరు కూతుళ్ళూ, తండ్రిని విడవలేక వాళ్ళ దగ్గరకు వచ్చేయమన్నారు. బ్రతిమాలేరు.

కానీ రామయ్య పంతులుగారు ఒప్పుకోలేదు.

"అమ్మా యిలూ... మీ ఆలోచన చాలా బాగుందమ్మా... కానీ... కానీ... నాకే మనస్సు ఒప్పటం లేదమ్మా... నా శేష జీవితం... ఇక్కడే... ఈ ఇంట్లోనే... గడిపెయ్యాలనుందమ్మా. మీరంతా తరచూ వస్తూ ఉండండి... అంతే చాలు."

మళ్ళీ ఇద్దరమ్మాయిలూ, అల్లుళ్ళూ ఎంతో... ఎన్నో విధాల బ్రతిమాలేరు. కానీ లాభం లేకపోయింది.

"నాన్న గారు వినరమ్మా... తనకి ఎంతతోస్తే అంత. మొదట్నుంచీ అంతే కదా...ఏం చేస్తాం...?" పిల్లలిద్దరి ఆవేదన.

ఇద్దరు కూతుళ్ళూ, అల్లుళ్ళూ ఎవరి ఊళ్ళకు వారు వెళ్ళారు చాలా బాధతో.

రామయ్య పంతులుగారు మాత్రం ఆ ఇంట్లోనే ఒక్కరూ ఉంటున్నారు.

టేపురికార్డరు మాత్రం ఎప్పటిలాగే అదేపాటని వినిపిస్తూ ఉంటుంది. ఆ ఇంట్లోంచి తరచుగా.

"మీ నగుమోమూ... నాకనులారా... కడదాకా... కన నిండూ..... పండుటాకుల మిగిలితిమీ."

"పండు టాకులు కాదుబాబూ. పాటమార్చాలిగదా! పండు టాకు ఒక్కటేకదా మిగిలింది. అది కూడా త్వరగా రాలిపోనీ భగవంతుడా." అంటూ ఏదో పిచ్చిపిచ్చిగా తనలో తను నవ్వుకుంటూ. కళ్ళ నీళ్ళు ఒత్తుకుంటూ ఉంటారు రామయ్య పంతులు గారు. ★